www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి
భద్రాద్రి
శనివారం | 07 | నవంబర్ | 2026
పేజీలు : 8

ముర్రేడుకు మహర్దశ

- వాగుపై రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.50.50 కోట్ల నిధులు మంజూరు
- ఫలించిన కూనంనేని కృషి
- తొలగనున్న ముంపు బాధలు
- త్వరలో పనులు ప్రారంభిస్తాం: కూనంనేని



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ముర్రేడువాగుకు మహర్దశవచ్చింది. వరద ముప్పుకు శాశ్వత పరిష్కారం చూపుతూ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.50.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. మూడేళ్లుగా తాను చేసిన కృషి ఫలితం లభించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అనుమతులు మంజూరు చేయడంతో పాటు వెనువెంటనే

మిగతా 2లో..

చెరువు తెలంగాణలో.. ఆయకట్టు ఆంధ్రాలో..!

-పెద్దవాగుకు మోక్షమెప్పుడు
-ఇబ్బందుల్లో ఆయకట్టు రైతాంగం
-బీళ్లుగా భూములు
-పనులు పూర్తి కాకుండానే మరోసారి గండి



2026 నవంబర్ 4 నాటి దృశ్యం

ప్రజాపక్షం/ ఖమ్మం : చుట్టూ గుట్టలు, దట్టమైన అటవీ ప్రాంతం మధ్యలో చెరువు. ఎటు చూసినా గిరిజన ఆవాసాలే. ప్రకృతి రమణీయతకు అలవాలమైన పెద్దవాగు ప్రాజెక్టు ఇప్పుడు శోభను కోల్పోయింది. ఈ చెరువు క్రింద పచ్చని పంటలతో అలరించాల్సిన భూములు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. గిరిజన ప్రాంతమైన అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి సమీపంలో నిర్మించిన పెద్దవాగు ప్రాజెక్టుకు 2024లో భారీ వరదల కారణంగా గండిపడింది. తాత్కాలిక మరమ్మతులతో కొంత నీటిని నిల్వ చేసేందుకు చేసిన ప్రయత్నం మురను తుఫాన్‌తో మరోసారి విఫలమైంది. ఇప్పుడు 16వేల ఎకరాల ఆయకట్టు బీడుగా మారింది. వివరాల్లోకి వెళితే... 1970 దశకంలో అప్పటి ప్రభుత్వం ఈ చెరువును నిర్మించింది. రెండు ప్రధాన కాలువల ద్వారా 16వేల ఎకరాలకు నీటిని అందించేవిధంగా చెరువును నిర్మించారు. 1980 దశకంలో ఓసారి చెరువు తెగింది. సాంకేతిక పద్ధతుల్లో చెరువు కట్టను మరింత బలిష్టంగా నిర్మించడంతో పాటు వరద ఉధృతి పెరిగినప్పుడు నీటిని విడుదల చేసేవిధంగా ప్రత్యేకమైన లాకులను ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని

మిగతా 2లో..



2024 జులై 18 నాటి దృశ్యం

పేదలకు అత్యాధునిక
వైద్యం అందించడమే లక్ష్యం



-హెటిరో డ్రగ్స్ చైర్మన్, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథిరెడ్డి సేవలను కొనియాడిన మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర
-కందుకూరులో మెగా ఉచిత వైద్య శిబిరం

ప్రజాపక్షం/సత్తుపల్లిః పేద, మధ్యతరగతి ప్రజలకు సైతం అత్యాధునిక వైద్య సేవలను ఉచితంగా, అందుబాటు ధరల్లో అందించాలన్నదే తన లక్ష్యమని హెటిరో గ్రూప్, సింధు హాస్పిటల్స్ చైర్మన్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి అన్నారు. ఆయన చొరవతో వేంసూరు మండలం కందుకూరులో గురువారం సింధు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మెగా ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మారుమూల గ్రామం నుంచి ప్రస్థానం ప్రారంభించి ఉన్నత స్థాయికి ఎదిగినప్పటికీ, పుట్టిన ఊరును, ప్రజలను మరువకుండా సేవా కార్యక్రమాలు చేపడుతున్న వ్యక్తి బండి పార్థసారథి రెడ్డి అని కొనియాడారు. 1,500 పడకలతో అత్యాధునిక వైద్య సదుపాయాలు కలిగిన సింధు హాస్పిటల్స్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కరోనా సమయంలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని ప్రశంసించారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో

మిగతా 2లో..

వట్టిపోతున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



-ప్రతి అవకాశాన్ని సానుకూలంగా మార్చుకోవాలి
-ఏఐవైఎఫ్ మోడల్ టెస్ట్ ప్రారంభం సందర్భంగా బాగం

ప్రజాపక్షం/ ఖమ్మం : దేశంలో పాలక వర్గాల ముందు చూపులేమి కారణంగా దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వట్టిపోతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయి ఒక విపత్తుగా మారనుందని యువ శక్తి నిర్వీర్యమవుతుందని ఆయన తెలిపారు. ఏఐవైఎఫ్ అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి మోడల్ ఎస్ఐ, కానిస్టేబుల్ టెస్ట్‌ను శుక్రవారం నిర్వహించారు. స్థానిక బిసి స్టడీ సర్కిల్‌లో బాగం హేమంతరావు, టూ టౌన్ సిఐ రామకృష్ణ, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత మోడల్ టెస్ట్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ యువశక్తిని వినియోగించుకోవడంలో ఈ దేశ పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. కోట్ల మంది

మిగతా 2లో..

చెరువు తెలంగాణలో.. ఆయకట్టు ఆంధ్రాలో..!

(మొదటిపేజీ తరువాయి

వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడంతో తెలంగాణలో ఉన్న అశ్వారావుపేట మండలంలో పెద్దవాగు ప్రాజెక్టు ఉండగా ఆయకట్టు అశ్వారావుపేటతో పాటు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఉంది. మొత్తం 16వేల ఎకరాల్లో అశ్వారావుపేట మండలంలో రెండువేల ఎకరాలు, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 14వేల ఎకరాలు, కుడి, ఎడమ కాలువల క్రింద సాగవుతుంది. రాష్ట్ర విభజన తర్వాత 2024 జులై 18న వచ్చిన వరదలకు ఈ ప్రాజెక్టుకు రికార్డు స్థాయి వరద చేరింది. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా లాకులు లేపి నీటిని విడుదల చేయడంలో జాప్యం జరిగింది. దీనితో లాకుల సమీపంలోనే మరోసారి పెద్దవాగు ప్రాజెక్టుకు భారీ గండిపడింది. ప్రాజెక్టుకు గండిపడడంతో పెద్దవాగు పరిధిలోని ఆయకట్టు భూముల భౌతికస్థితి కూడా మారిపోయింది. అంతటి వరద ఉధృతిని ఈ ప్రాంతం చవిచూసింది.

మరమ్మతుల కోసం ఎదురు చూపు :

పెద్దవాగు ప్రాజెక్టుకు కరువు సమయంలోనూ నీటి కొరత లేదు. అటవీ ప్రాంతం కావడం మిగిలిన ప్రాంతాల కంటే కాస్తో కూస్తో వర్షపాతం ఎక్కువగా ఉండడంతో పెద్దవాగు ప్రాజెక్టుకు నీరు చేరడం, ఆయకట్టులో సమృద్ధిగా నీరు చేరడం, పంటలు పండటం ఇక్కడ ఆనవాయితీగా మారింది. 2024లో ప్రాజెక్టుకు గండిపడిన తర్వాత ఆంధ్రా ఆయకట్టు తెలంగాణ ఆయకట్టుకు ఏడు రేట్లు ఎక్కువగా ఉండడంతో మరమ్మతుల విషయంలో రెండు రాష్ట్రాలు పాలు పంచుకోవాలని ఒక ప్రయత్నం జరిగింది. ఏమైందో కానీ పెద్దవాగు ప్రాజెక్టు మరమ్మతు పనులు ముందుకు సాగలేదు. చివరకు మూడున్నర కోట్లతో తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. లాకుల వద్ద పడిన గండిని పూడ్చేందుకు పనులు ప్రారంభించారు. ఈనెల మూడు, నాలుగు తేదీలలో కురిసిన భారీ వర్షాలకు మరోసారి పెద్దవాగు ప్రాజెక్టు కట్ట లాకుల సమీపంలో తెగిపోయింది. ఇప్పుడు నీరు నిలబడే పరిస్థితి లేదు. ఆంధ్రాలో 14వేల ఎకరాల ఆయకట్టు ఉన్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో రెండు రాష్ట్రాలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉంది. సాగుకు నీటి కొరతను ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితులలో ప్రకృతి అందించిన వరప్రసాదంగా భావించే పెద్దవాగు ప్రాజెక్టుకు సంబంధించి రెండు ప్రభుత్వాలు చర్చించి వచ్చే ఏడాదికైనా ఆయకట్టుకు నీరందించేవిధంగా పెద్దవాగు చెరువుకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతాంగం కోరుతుంది. ఇప్పటికే పలుమార్లు ప్రాజెక్టు పునర్ నిర్మాణానికి సంబంధించి పలుమార్లు అంచనాలు వేశారు. కానీ ఇంత వరకు నిధులు మంజూరు చేసి కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా రెండు ప్రభుత్వాలు సానుకూల ఆలోచన చేసి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

పేదలకు అత్యాధునిక వైద్యం అందించడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి

బండి పార్థసారథిరెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని, గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడం గొప్ప విషయమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య సైతం బండి పార్థసారథిరెడ్డి సేవలను కొనియాడుతూ, ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు అత్యాధునిక వైద్యం అందించే ప్రయత్నం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. బండి పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ.. సింధు హాస్పిటల్స్‌లో నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన ఆసుపత్రి, ఆయుష్మాన్ భారత్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. వైద్యం అనేది కొందరికే పరిమితమైన సౌకర్యం కాకుండా ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కుగా అందుబాటులో ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు.

గ్రామీణులకు అందుబాటులోకి ప్రత్యేక వైద్య బస్సులు...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గ్రామీణ ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు అందించేందుకు సింధు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బస్సులను ప్రవేశపెట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ బస్సుల ద్వారా మామోగ్రఫీ, క్యాన్సర్ స్క్రీనింగ్, దంత వైద్యం, ఊబకాయం,



ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ తదితర పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతిరోజూ ఒక్కో గ్రామాన్ని సందర్శించి ప్రజలకు వైద్య పరీక్షలు అందించనున్నట్లు పేర్కొన్నారు. పేదల ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా ముందస్తు రోగ నిర్ధారణ, సకాలంలో చికిత్స అందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కందుకూరులో నిర్వహించిన శిబిరానికి ప్రజలు భారీగా తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బండి పార్థసారథిరెడ్డి చేపడుతున్న ఈ సేవా కార్యక్రమాలు గ్రామీణ పేదలకు ఆరోగ్య భరోసాగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్ ,సింధు హాస్పిటల్స్ ఎండి సోమరాజు, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ,సర్పంచ్ మందపాటి వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముర్రేడుకు మహర్దశ

(మొదటిపేజీ తరువాయి)



రాష్ట్ర ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్క నిధుల మంజూరీ ఉత్తర్వులు జారీ చేయడంపై కూనంనేని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనావాసాల మధ్య నుండి పారుతున్న ముర్రేడువాగుకు రిటైనింగ్ వాల్ నిర్మించడంలో గత పాలకులు విఫలమయ్యారని అన్నారు. ఏళ్లతరబడి వాగు ఉధృతి వల్ల శ్రీనగర్ ప్రశాంతినగర్ సాయినగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని భారీ వర్షాలతో వరదనీరు ఇళ్లలోకి చేరి ప్రజలు నిద్రలేని రాత్రులు గడిపారని గుర్తు చేశారు. గత పాలకులు ఈ సమస్యను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో దశాబ్దాలుగా ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీశారని పేర్కొన్నారు. శ్మశాన వాటికలకు వెళ్లే మార్గాలు సైతం మునిగిపోయి ప్రజలు నరకయాతన అనుభవించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల బాధలు తొలగాలంటే రిటైనింగ్ వాల్ నిర్మాణమే శాశ్వత పరిష్కారమని అందుకోసం మంత్రులపై ఒత్తిడితెచ్చి నిధులు సాధించామని తెలిపారు. ఫలితంగానే ముర్రేడువాగుపై ఇరువైపులా పటిష్టమైన రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని స్పష్టం చేశారు. ఈ రక్షణ గోడతో ముంపు ప్రాంతాలప్రజలకు వరద ముప్పు నుండి శాశ్వత విముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. త్వరలోనే పనులను ప్రారంభించి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కట్టుబడి ఉంటామని కూనంనేని స్పష్టం చేశారు.

వట్టిపోతున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



(మొదటిపేజీ తరువాయి)

నిరుద్యోగులకు అరకొర నోటిఫికేషన్లు సంతృప్తిని ఇవ్వలేవని ఆయన తెలిపారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థలో ఖాళీలు నింపేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వనున్న నేపథ్యంలో ఏఐవైఎఫ్ నిరుద్యోగుల కోసం మోడల్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉద్యోగ సాధనలో ఈ మోడల్ టెస్ట్ ఎంతో ఉపకరిస్తుందని ఆయన తెలిపారు. పోటీ ప్రపంచంలో ఇటువంటి మోడల్ టెస్ట్‌లు రాయడం ద్వారా అనుభవంతో లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చునని హేమంతరావు సూచించారు. టూటౌన్ సిఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే పరీక్షలకు అభ్యర్థులను సంసిద్ధం చేసేందుకు మోడల్ టెస్ట్ నిర్వహణ అవసరమన్నారు.

శ్రీ దివ్య జూనియర్ కళాశాలలో :

ఏఐవైఎఫ్ ఎస్ఐ, కానిస్టేబుల్ మోడల్ టెస్ట్‌ను వన్ టౌన్ పరిధిలోని శ్రీ



దివ్య జూనియర్ కళాశాల నందు శుక్రవారం నిర్వహించారు. న్యాయవాది జాగర్లమూడి రంజిత్, టూటౌన్ సిఐ సాధిక్ పాషా తదితరులు మోడల్ ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ పరీక్షకు సంసిద్ధమయ్యేందుకు మోడల్ టెస్టులు ఉపయోగపడతాయన్నారు. నిరంతర సాధనతో లక్ష్యాన్ని చేరుకోవచ్చునని వారు తెలిపారు. ఈ మోడల్ టెస్ట్‌కు యువత నుంచి విశేష ఆదరణ లభించింది. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు.ఈ కార్యక్రమంలో బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రావి శివ రామకృష్ణ, ఏఐవైఎఫ్ జాతీయ సమితి సభ్యులు నానబాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు మనోజ్, మద్దోజు శ్రవణ్, దుర్గానాథ్, కృష్ణప్రసాద్, దండి శ్రీజ, బొప్పి ఉమా, యమున, కిరణ్, భీమేష్, అభిరాంరెడ్డి, సాయి పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామపంచాయతీగా కృష్ణాపురం

ప్రజాపక్షం/మధిరః కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని గ్రామ పంచాయతీలను పిఎంఏజేవై ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ది ఆదర్శ గ్రామ పంచాయతీలుగా ఎంపిక చేయడం జరిగింది. దానిలో భాగంగా మధిర మండలం నుండి కృష్ణాపురం గ్రామం ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్, ఖమ్మం జిల్లా కాంగ్రేస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో కులమత రాజకీయాలకు అతీతంగా ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, భవిష్యత్తులో కూడా అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేపట్టి ఆదర్శ గ్రామంగా ముందుకు వెళతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్యా నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ కొత్తపల్లి నర్సింహారావు, విబిజి రాము. పంచాయతీ సిబ్బంది విజయకుమార్, ముత్తయ్య, ప్రసాదరావు, నరేష్, నర్సింహారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వసతి గృహాల విద్యార్థుల సమస్యలు పట్టించుకోరా?



ప్రజాపక్షం/జూలూరుపాడుః అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జూలూరుపాడు మండల సమితి ఆధ్వర్యంలో జూలూరుపాడు మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ మాట్లాడుతూ అనంతరం విద్యార్థులతో మాట్లాడే పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా సాగర్, సంపత్ ను ఎన్నుకున్నారు. వారితోపాటు 10 మంది హాస్టల్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు అనిల్ కుమార్, బాలాజీ, మండల నాయకులు అనిల్, అఖిల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు



ప్రజాపక్షం/మణుగూరుః భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఇటీవల సంభవించిన వరుస తుఫాన్లు అర్నవ్, మురాసు కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు డిమాండ్ చేశారు. చేతికొచ్చే దశలో ఉన్న వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు తుఫాన్ల ప్రభావంతో పంటలు దెబ్బతింటుంటే, మరోవైపు సరిపడా సాగునీరు అందక, విద్యుత్ సరఫరా లేక అనేక ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగానికి న్యాయం చేయలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిలో కొనసాగే నైతిక హక్కును కోల్పోయారని, తక్షణమే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని రేగా కాంతారావు డిమాండ్ చేశారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో ప్రతి గ్రామంలో పంట నష్టంపై తక్షణమే సర్వే నిర్వహించాలన్నారు. వరి, పత్తి, మిర్చి తదితర పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు తగిన నష్టపరిహారం చెల్లించాలన్నారు. కరెంట్, సాగునీరు అందక ఎండిపోయిన పంటలను కూడా గుర్తించి ప్రత్యేక పరిహారం అందించాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని రేగా కాంతారావు డిమాండ్ చేశారు.

గ్రీన్ క్రాకర్స్ వినియోగానికి ప్రాధాన్యతనివ్వాలి



-పర్యావరణ హితంగా దీపావళి జరుపుకోవాలి
-బాణాసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలి
-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పర్యావరణ హితం కోసం గ్రీన్ క్రాకర్స్ వినియోగానికి ప్రాధాన్యతనిస్తూ సురక్షితంగా, సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో దీపావళి పండుగను జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం తెలిపారు. శబ్ద, వాయుకాలు ష్యాన్ని తగ్గించే విధంగా ప్రతిబక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. బాణాసంచా కాల్చే సమయంలో ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లలు బాణా సంచా కాల్చేటప్పుడు పెద్దలు తప్పనిసరిగా వారి పక్కనే ఉండి పర్యవేక్షించాలన్నారు. టపాసులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు ధరించాలన్నారు. భవనాలు, విద్యుత్ తీగలకు దూరంగా ఉన్న ఖాళీ ప్రదేశాలలో మాత్రమే బాణాసంచా కాల్చాలని తెలిపారు. టపాసులు కాల్చే ప్రాంతంలో ముందస్తుగా ఒక బకెట్ నీరు, ఇసుక, ప్రథమ చికిత్స సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రమీదలు, దీపాలను ఒక స్థిరమైన ప్రదేశాలలో కర్టెన్లు, ప్లాస్టిక్ వస్తువులు, ఇతర మండే వస్తువులకు దూరంగా ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పాడాలని తెలిపారు. ప్రమాదాలకు తావులేకుండా కుటుంబ సభ్యులతో కలిసి సురక్షితమైన, ఆనందకరమైన దీపావళి పండుగను జరుపుకోవాలని కలెక్టర్ కోరారు.

రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..



-మురసు తుఫాన్‌తో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : దమ్మపేట మండలం నాచారం గ్రామంలో మురసు తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న పంట పొలాలను శుక్రవారం అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు పరిశీలించారు. నేలకొరిగిన పంటలను, రైతులకు జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆసన్నగూడెం వద్ద తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రహదారిని పరిశీలించారు. ఈసందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ మురసు తుఫాన్ కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, నెలల తరబడి కష్టపడి పండించిన పంట కళ్లముందే దెబ్బతినడంతో అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్టుబడుల భారం, సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రకృతి వైపరీత్యం మరింత నష్టాన్ని మిగిల్చిందన్నారు. దెబ్బతిన్న ధాన్యాన్ని నిబంధనల పేరుతో తిరస్కరించకుండా ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేసి పారదర్శకంగా నివేదికలు రూపొందించి బాధిత రైతులందరికీ న్యాయం చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కేవలం పంట పొలాల వద్దకు వచ్చిఫొటోలకు ఫోజులిచ్చి వెళ్లపోవడం వల్ల రైతులకు ఒరిగేదేమి లేదని విమర్శించారు. రైతులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీకటి రమాదేవి, చీకటి రామయ్య, శ్రీనివాస్, పాకనాటి శ్రీను, మాడా సుదర్శన్‌రావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలకోటకు అరుదైన గౌరవం!



-పిఎం అజయ్ పథకానికి ఎంపికైన గ్రామం
-సర్పంచ్ పైడిపల్లి అనిత కిషోర్ పాలనకు గుర్తింపు
-సమగ్ర అభివృద్ధికి బాటలు

ప్రజాపక్షం/బోనకల్: మండలంలోని కలకోట గ్రామానికి అరుదైన గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన(పిఎంఏజెఏవై) పథకానికి కలకోట గ్రామం ఎంపికైంది. దీంతో గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కొత్త అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామ సర్పంచ్ పైడిపల్లి అనిత కిషోర్ సమర్థవంతమైన పరిపాలన, గ్రామాభివృద్ధిపై చూపుతున్న అంకితభావానికి ఈ గుర్తింపు దక్కిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం ప్రధాన ఉద్దేశం ఎస్సీ వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతితో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడం. ఇందులో భాగంగా తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, వీధిదీపాలు, విద్య, వైద్యం, గృహ వసతులు వంటి రంగాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పిస్తారు. అలాగే అర్హులైన ఎస్సీ కుటుంబాలకు నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి, జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు కూడా చర్యలు చేపడతారు. పిఎం అజయ్ ఆదర్శ గ్రామ విభాగం కింద ఎంపికైన ప్రతి గ్రామానికి మౌలిక వసతుల లోటును భర్తీ చేసేందుకు నిబంధనల ప్రకారం రూ.20 లక్షల వరకు గ్యాప్ ఫిల్లింగ్ నిధులు, గ్రామాభివృద్ధి ప్రణాళిక, శిక్షణ, అవగాహన కార్యక్రమాల కోసం రూ.లక్ష పరిపాలనా వ్యయంగా కోటాయించే అవకాశం ఉంది. ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేయడం ద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. గ్రామంలో ప్రస్తుతమున్న సమస్యలను గుర్తించి గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపొందించడం, గ్రామ సభ ఆమోదం పొందడం, సంబంధిత అధికారుల సమన్వయం తో పనులను ముందుకు తీసుకెళ్లడం ద్వారా ఈ పథకాన్ని సమర్థవంతగా అమలు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కలకోట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని సర్పంచ్ పైడిపల్లి అనిత కిషోర్ సంతోషం వ్యక్తం చేశారు. కలకోట గ్రామానికి ఈ అవకాశం లభించడంపై గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు, సిపిఐ నాయకులు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షిస్తూ సర్పంచ్ అనిత్ కిషోర్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఏరియా హాస్పిటల్ మణుగూరులో ఉదయం 9 గంటల నుండి సేవలు

ప్రజాపక్షం/మణుగూరుః మండల కేంద్రమైన మణుగూరులోని ఏరియా హాస్పిటల్‌లో నేడు ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పాలమిక్ ఆఫీసర్ జి. సంజీవరావు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు మరియు కంటి ఆపరేషన్లు చేయించుకోవాలనుకునే వారు ఈ శిబిరాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.గుండాల, ఆళ్లపల్లి, కరకగూడెం, పినపాక, మణుగూరు, అశ్వాపురం మరియు బూర్గంపహాడ్ మండలాల ప్రజలు కంటి సమస్యలతో బాధ పడేవారు శిబిరంలో పరీక్షల అనంతరం కంటి ఆపరేషన్లకు ఎంపికైన రోగులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు మరియు రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను అందజేయాల్సి ఉంటుందని ఆస్పాలమిక్ ఆఫీసర్ జి. సంజీవరావు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బేతుపల్లి రక్షణ చర్యలపై కలెక్టర్‌కు సిఎస్ ప్రశంసలు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : బేతుపల్లి చెరువులో చిక్కుకున్న వారిని సమన్వయంతో ప్రాణ నష్టం జరగకుండా కాపాడిన ఖమ్మం కలెక్టర్ నాయకత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ గ్రామీణ పట్టణ ప్రాంతాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట ప్రైవేటు బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. చేతి పంపులు, బోర్ల మరమ్మతులు నవంబర్ 15 నాటికి పూర్తి చేసి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైన్ నిర్వహించాలన్నారు. పిఎంశ్రీ సమగ్ర శిక్ష అభియాన్ నిధులను పాఠశాలల మౌలిక వసతులకు పూర్తి స్థాయిలో వినియోగించాలన్నారు. కేంద్ర పథకాల పురోగతిని సిఎం డ్యాష్‌బోర్డులో నమోదు చేయాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేసి మార్చి నాటికి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. బేతుపల్లి చెరువులో చిక్కుకున్న వారిని సమన్వయంతో రక్షించిన ఖమ్మం కలెక్టర్ నాయకత్వాన్ని సిఎస్ ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి భూసేకరణ అవార్డులు 95 శాతం పూర్తయ్యాయన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాల ఫలాలను ప్రజలకు చేరవేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డివో శ్రీరామ్, డిపివో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

మంచుకొండ సొసైటీని సందర్శించిన నాబార్డు అధికారులు



ప్రజాపక్షం/రఘునాథపాలెం : మండల పరిధిలోని మంచుకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఏసిఎస్)ను నాబార్డు అధికారులు, శాస్త్రవేత్తలు సందర్శించారు. శుక్రవారం సొసైటీని ఖమ్మం నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుజిత్ ఎల్, వైరా కెవికె శాస్త్రవేత్త డా।। టి. పావని సందర్శించారు. సొసైటీ పరిధిలో అమలవుతున్న విత్తనోత్పత్తి ప్రాజెక్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందుతున్న ప్రోత్సాహకాల గురించి ఆరా తీశారు. అనంతరం రైతు సత్యనారాయణరెడ్డి పొలాన్ని సందర్శించి అక్కడ ఏడు ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన వరి విత్తనోత్పత్తి సాగు విధానాన్ని, పంట ఎదుగుదలను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతుతో మాట్లాడి పలు అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విత్తనోత్పత్తితో రైతులకు అధిక ఆదాయం సమకూరుతుందని వారు తెలిపారు. రైతులు విత్తనోత్పత్తికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ సిఈవో శ్రీనివాసరావు, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

తీర్థాలలో ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్‌పై వివాదం



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలంలోని తీర్థాల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిరుల వెరిఫికేషన్ ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. శుక్రవారం మండల పరిషత్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేసన్ కోసం గ్రామానికి వచ్చిన ఎంపీఓ మణిని బిఆర్ఎస్ నాయకులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బిఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ తేజావత్ బాలకృష్ణతో పాటు ప్రస్తుత సర్పంచ్ ఎంపీఓకు వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని కోరారు. కేవలం కమిటీ ఆధ్వర్యంలోనే లబ్ధిదారుల పేర్లను ప్రకటించారని, ఆ జాబితాలో ఇప్పటికే ఇండ్లు, వ్యవసాయ భూములు ఉన్నవారి పేర్లు కూడా ఉన్నాయని వినతిలో ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీను, మాజీ ఉపసర్పంచ్ రవికిరణ్, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రమణయ్య, బిఆర్ఎస్ నాయకులు శివ శంకర్, బాబు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

30న తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : మండలంలోని సుధాపల్లిలో ఆదివాసి ఐక్య కార్యాచరణ కమిటీ అత్యవసర సమావేశం శుక్రవారం జరిగింది. ఈసమావేశంలో ఆదివాసి సంఘాల మండల అధ్యక్షులు సోయం మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 1/70 చట్టాన్ని కాపాడుకోవడం కోసం ఆదివాసీలందరూ ఐక్యంగా ఉద్యమించాలని, ఆదివాసి చట్టాలను రక్షించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 30న దమ్మపేట తహశీల్దార్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయడానికి వేలాదిగా భారీ సంఖ్యలో ఆదివాసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కులు చట్టాలను హరించాలని చూస్తే సహించేది లేదని, 1/70 చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో గిరిజనేతరులు వేసిన పిటిషన్ వాపస్ తీసుకోవాలని, లేని పక్షంలో తగిన సమయంలో వారికి ఎలా బుద్ధిచెప్పాలో మాకు తెలుసునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘాల నాయకులు బండారు సూర్యనారాయణ, కొర్సా వెంకటేష్‌దొర, వెంకటేశ్వరరావు, కుంజా చిన్నబాబు, కుర్సం చిన్నరాజు, తాటి రాము, తోలెం శ్రీను, కారం బోడయ్య, పద్దం విజయలక్ష్మి, మడకం ప్రసాద్, వెలకం అంజి, కేసరి వెంకటస్వామి, దారబోయిన పోతురాజు, ఉమ్మల సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేటలో భారీ నష్టం



వెంకమ్మ చెరువు గండిని పరిశీలించిన మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/ అశ్వారావుపేట ః మురసు తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేట మండలంలో కురిసిన అత్యంత భారీ వర్షాలకు గండిపడిన వెంకమ్మ చెరువును రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పరిశీలించారు. శుక్రవారం మండలంలో విస్తృతంగా పర్యటించి భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. బాధిత రైతులకు జరిగిన పంట నష్టాన్ని, దెబ్బతిన్న రహదారులను పరిశీలించారు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మురసు తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేట ప్రాంతంలో అత్యంత భారీ వర్షపాతం నమోదైందని తెలిపారు. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో ఆకస్మిక వరదలు సంభవించాయని, భారీ వరదల కారణంగా ఉద్యాన పంటలు, వరి పంటలు నీట మునిగి రైతులకు నష్టం వాటిల్లిందని అన్నారు.పలు ప్రాంతాల్లో రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. పంట నష్టం, రహదారుల మరమ్మత్తులకు సంబంధించి పూర్తి వివరాలతో శుక్రవారం సాయంత్రంలోగా నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తుఫాన్ వల్ల జరిగిన నష్టంపై సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందచేస్తామని తెలిపారు. అత్యంత భారీ వర్షాలు, వరదలు సంభవించినప్పటికీ పామాయిల్ సాగుకు పెద్దగా నష్టం వాటిల్లకుండా పంట నిలబడటం విశేషమని మంత్రి పేర్కొన్నారు. అతివృష్టి, అనావృష్టి వంటి అసమతుల్య వాతావరణ పరిస్థితులు తరచూ ఎదురవుతున్న ప్రస్తుత తరుణంలో పామాయిల్ సాగు రైతాంగానికి ఒక వరంగా మరుతోందని, ఈ పరిస్థితులు మరోసారి నిరూపించాయని మంత్రి తుమ్మల అన్నారు. రైతులకు అండగా నిలుస్తూ పంట నష్టం అంచనా, రహదారుల పునరుద్ధరణ, దెబ్బతిన్న చెరువుల మరమ్మత్తులపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, వివిధశాఖ అధికారులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా వైరా ఎంఎల్ఏ కుమారై వివాహ నిశ్చితార్థం

-వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి



ప్రజాపక్షం/కారేపల్లి: వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ కుమారై డాక్టర్ గాయత్రి, రామ్ నాయక్ వివాహ నిశ్చితార్థ వేడుక శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎంఎల్ఏలు, ప్రజాప్రతినిధులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ పొరిక బలరాం నాయక్, ఎంఎల్ఏలు నవీన్ యాదవ్, యశస్విని రెడ్డి, కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, ఎంఎల్సీ అద్దంకి దయాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పీఆర్వో దూదిపాళ్ల విజయ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు రామచంద్రనాయక్, మాజీ మంత్రి పువ్వాల అజయ్‌కుమార్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల శాఖ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్ తదితరులు వేడుకలో పాల్గొన్నారు. వైరా నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, జర్నలిస్టులు, అధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలకు ఫ్యాన్ అందజేత



ప్రజాపక్షం/కారేపల్లి: విద్యార్థుల సౌకర్యార్థం గుంపెళ్లగూడెం గ్రామంలోని యూపీఎస్ పాఠశాలకు గ్రామ ఉప సర్పంచ్ భూక్య శంకర్ నాయక్ ఫ్యాన్ అందజేశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఆయన చేసిన సహకారంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ యువ నాయకుడు గుగులోత్ వీరబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు రూ. 50వేలు నష్ట పరిహారం చెల్లించాలి



-ఏఐకెఎస్ బహిరంగ సభకు వేలాదిగా తరలిరండి
-సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/జూలూరుపాడుః మురసు తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి లక్ష రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గార్లపాటి వెంకటి అధ్యక్షతన సీపీఎం జూలూరుపాడు మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మురసు తుపాను ప్రభావం వల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేతికొచ్చిన పంటలు నీట మునిగాయన్నారు. దీంతో మిర్చి, పత్తి, వరి పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయని అన్నారు. సమగ్ర సర్వే జరిపి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఛలో నల్గొండకు వేలాది మంది తరలిరండి. నవంబర్ 15 నుంచి 18వ తేదీవరకు రైతు సంఘం అఖిల భారత మహాసభలు నల్గొండలో జరుగుతున్నాయన్నారు. నవంబర్ 15 న జరిగే భారీ బహిరంగ సభకు జిల్లా నుంచి వేలాది మంది కదలాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోందని తెలిపారు. దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలకు రూపకల్పన చేయబోతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, విదేశీ వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలని, రైతుల భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ తీర్మానాలు చేస్తున్నారని అన్నారు. దేశ వ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు, నవంబర్ 15 న లక్ష మందితో బహిరంగసభ జరుగుతోందన్నారు. అదే విధంగా జూలూరుపాడు మండలాన్ని కరువు మండలం గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, మండల కమిటీ సభ్యులు బానోత్ ఈశ్వర్, రాచబంటి కోటేశ్వరరావు, మాలోత్ రాములు, ధర వాత్ రమేష్, పద్ధం సుగుణ, తాటి పద్మ, బోడ అభిమిత్ర, జల్లిక రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత రైతులకు తక్షణ పరిహారం అందించాలి



ప్రజాపక్షం/చండ్రుగొండ: తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు ధారా బాబు, సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం పంట నష్టంపై సమస్యలను వివరిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ హైందవతికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో వరి, పత్తి, మిరప పంటలు తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని, అర్హులైన రైతులకు నష్టపరిహారం అందించేలా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని కోరారు. పంట నష్టంపై ప్రభుత్వం స్పందించి తగిన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాద లింగయ్య, ఉప సరపచ్ బాలు నాయక్, కేలోత్ శ్రీను, భూపతి రమేష్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి నిర్మూలనకు చట్టపరమైన రక్షణ



న్యాయసేవలపై అందరికి అవగాహన కలిగి ఉండాలి
మణుగూరు జేఎఫ్‌సీఎం సూరి రెడ్డి

ప్రజాపక్షం/మణుగూరుః వెట్టిచాకిరీ వంటి బలవంతపు శ్రమ నుంచి విముక్తి పొందేందుకు చట్టపరమైన రక్షణ ఉందని, ప్రతి ఒక్కరూ తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మణుగూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె సూరి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మణుగూరు కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ న్యాయసేవల దినోత్సవం, నాల్సా వెట్టిచాకిరీ విముక్తి అంశాలపై న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ సూరి రెడ్డి మాట్లాడుతూ అప్పులు, ఆర్థిక ఇబ్బందులు లేదా ఇతర ఒత్తిళ్ల కారణంగా ఎవరినైనా వారి ఇష్టానికి విరుద్ధంగా పనిచేయించడం, అప్పు తీర్చే పేరుతో స్వేచ్ఛను హరించడం చట్టవిరుద్ధమన్నారు. చేసిన పనికి తగిన ప్రతిఫలం పొందడం, స్వేచ్ఛగా జీవించడం ప్రతి వ్యక్తి హక్కు అని తెలిపారు. వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, ఇటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడు బాధితులు సంబంధిత అధికారులను లేదా న్యాయసేవాధికార సంస్థలను సంప్రదించాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడినవారు, మహిళలు, పిల్లలు, కార్మికులు, ఇతర అర్హులైన వర్గాలకు ఉచిత న్యాయసహాయం అందుబాటులో ఉందని తెలిపారు. న్యాయసేవల ముఖ్య ఉద్దేశం సామాన్య ప్రజలకు న్యాయాన్ని చేరువ చేయడమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్ సావిత్రి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి, న్యాయవాదులు కె నరసింహారావు, పి భాస్కర్‌రావు, ఎ సర్వేశ్వరరావు, సీహెచ్ సరస్వతి, ఈ రాము, ఎం వాసవి, బి సునీత, కనకరాజు, ఎంఎల్ఏసీ సిబ్బంది ఎ రవీందర్ పాల్గొన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలివ్వాలి



ప్రజాపక్షం/చండ్రుగొండ: సీలింగ్ భూములకు సర్వే నిర్వహించి, హద్దులు నిర్ణయించి పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన రైతులు శుక్రవారం చండ్రుగొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ దామరచర్ల రెవెన్యూ పరిధిలోని 136 ఎకరాల సీలింగ్ భూములను శుక్రవారం సర్వే చేసి 12 మంది రైతులకు హద్దులు గుర్తిస్తామని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారని తెలిపారు. అయితే నోటీసుల ప్రకారం భూముల వద్దకు వెళ్లగా అధికారులు అక్కడికి రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను కార్యాలయానికి పిలిచి అధికారులు అందుబాటులో లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పట్టాలు పంపిణీ చేసే వరకు అర్ధరాత్రి అయినా ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. 170వ షెడ్యూల్ అమలు చేయాలని, గిరిజన చట్టాలకు అనుగుణంగా సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సీతాయిగూడెం, దామరచర్ల గ్రామాలకు చెందిన గిరిజన రైతులు పాల్గొన్నారు.

మత్తు వద్దు.. మంచి భవిష్యత్తు ముద్దు



**ప్రజాపక్షం/మధిరఃఃః

నీటి గండం పొంచి ఉన్నా.. వరి వైపే రైతులచూపు..!



-సాగునీటి హెచ్చరికలు బేఖాతర్
-నారుమళ్లకు రైతుల సన్నాహాలు
-ఆరుతడి పంటల సాగుపై ఆసక్తి కరువు

ప్రజాపక్షం/నేలకొండపల్లి : రానున్న రోజుల్లో నీటి ఎద్దడి తప్పదని ప్రభుత్వం, వ్యవసాయ శాఖ పదేపదే హెచ్చరిస్తున్నా రైతుల నిర్ణయం మాత్రం మారడం లేదు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు కొనసాగనున్నాయని, బోరుబావులపై ఒత్తిడి పెరుగుతుందని చెబుతున్నా రైతులు వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. ప్రత్యామ్నాయంగా పెసర, మినుములు, కందులు, సజ్జలు సాగు చేయాలని సూచనలు వస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం నారుమళ్ల ఏర్పాట్లు జోరందుకున్నాయి. జిల్లాలో లోటు వర్షపాతం కారణంగా చెరువులు, వాగులు, కుంటలు ఆశించిన మేర నిండలేదు. యాసంగిలో సాగునీటి కొరత తీవ్రంగా ఉండొచ్చన్న అంచనాలు ఉన్నా రైతులు బోరుబావుల ఆధారంగా వరి సాగుకు సిద్ధమవుతున్నారు. భూగర్భ జలాల లభ్యతపై సందేహాలు ఉన్నా దుక్కులు దున్ని నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు. వరి సాగులో యాంత్రీకరణ రైతులను మరింత ఆకర్షిస్తోంది. నాట్లకు కూలీలు అందుబాటులో ఉండటం, పురుగుమందుల పిచికారీకి డ్రోన్లు, కోతలకు యంత్రాలు లభిస్తుండటంతో శ్రమ తగ్గిందని రైతులు భావిస్తున్నారు. అదే ఆరుతడి పంటల్లో నిరంతరం పర్యవేక్షణ అవసరం కావడంతో వాటి వైపు ఆసక్తి చూపడం లేదు. మూడు నెలల్లో చేతికి వచ్చే హెచ్‌ఎంటీ, చింట్లూ రకాల వరి సాగుపైనే రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. వరి కోసిన వెంటనే ధాన్యాన్ని విక్రయించుకోవచ్చనే నమ్మకం వారిలో ఉంది. మరోవైపు ఆరుతడి పంటలు సాగు చేసినా గిట్టుబాటు ధర దక్కుతుందో లేదోనన్న అనుమానంతో వెనుకడుగు వేస్తున్నారు. పెసర, మినుములు, కందులు, సజ్జలు, శనగతో పాటు కూరగాయలు, ఆకుకూరలు సాగు చేయాలని అధికారులు సూచిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆశించిన స్పందన కనిపించడం లేదు. ఏ పంటకు ఎంత పెట్టుబడి? ఎంత లాభం? అనే అంశాలపై స్పష్టమైన అవగాహన లేకపోవడం కూడా వరి వైపు రైతులను మళ్లిస్తోంది. అడవి జంతువులు, కోతుల బెడదతో ఆరుతడి పంటలకు నష్టం వాటిల్లుతుందనే భయం కూడా ఉంది. గత యాసంగిలో జిల్లావ్యాప్తంగా 2,46,000 ఎకరాల్లో వరి సాగు జరగగా, ఈసారి 70500 ఎకరాలకు పరిమితం కావచ్చని వ్యవసాయ శాఖ యాక్షన్ ప్లాన్‌లో అంచనా వేసింది. అయితే క్షేత్రస్థాయిలో రైతులు వరి సాగుకే సిద్ధమవుతుండటంతో ఈ అంచనాలు ఎంతవరకు అమలవుతాయో చూడాల్సి ఉంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం :
యం.రాధ, మండల వ్యవసాయ అధికారి



ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించి ప్రత్యామ్నాయ పంటలపై సూచనలు ఇస్తున్నాం. రాబోయే నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని బోరుబావుల కింద వరి సాగు చేయొద్దని కోరుతున్నాం.

పీహెచ్‌సీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, డాక్టర్ శ్రీధర్ దుమ్ముగూడెం, పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రయోగశాల రికార్డులు, ఔషధాల పంపిణీ రికార్డులు, మందుల నిల్వను పరిశీలించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, ముఖ్యంగా అత్యవసర మందుల కొరత లేకుండా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రతి గర్భిణికి ఆసుపత్రిలోనే ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో వేగవంతమైన జ్వరాల సర్వే, డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని, జ్వరాలు అధికంగా నమోదయ్యే గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వసతి గృహాల్లోనూ వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయాలని తెలిపారు. ఈ తనిఖీల్లో వైద్యాధికారి డాక్టర్ రుక్మాకర్‌రెడ్డి, సీహెచ్‌ఓ బాబూరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధుప్‌సింగ్ మృతదేహానికి నివాళి



ప్రజాపక్షం/కారేపల్లి: మండల పరిధిలోని భాగ్యనగర్ తండాకు చెందిన లావుడియా ధుప్‌సింగ్ మృతి చెందడంతో ఆయన పార్థివదేహానికి వైరా మాజీ ఎంఎల్‌ఏ లావుడియా రాములు నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ధుప్‌సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈకార్యక్రమంలో నాయకులు అజ్మీర వీరన్న, సింగరేణి కార్మిక సంఘం నాయకులు గుగులోత్ శంకర్, దారావత్ రాంజీ, భూక్య రాంకిషోర్ నాయక్, గుగులోత్ హారు, జర్పుల చందర్, బానోత్ వెంకటియా, గ్రామ పెద్దలు గుగులోత్ నారాయణ, గుగులోత్ కుమార్, గుగులోత్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడికి పరామర్శ



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఒమేగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను సింగరేణి మండల మాజీ రైతుబంధు కన్వీనర్ గుగులోతు శ్రీనునాయక్, మాజీ దుబ్బతండ ఎంపీటీసీ దారావత్ పాండ్యా నాయక్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో శ్రీనన్న ముఖ్య అనుచరులు కట్ల శ్రీనివాసరావు, పాత కమలాపురం గ్రామ పంచాయితీ కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి తిరుపతయ్య, గ్రామ పెద్ద కాటిన్ని రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి డయాగ్నొస్టిక్ ల్యాబ్ మంజూరు



- అత్యవసర రోగులకు ఐకే సిటి స్కానింగ్ సదుపాయం

ప్రజాపక్షం/భద్రాచలం : నాగులు రాష్ట్ర ప్రజల సరిహద్దుగా ఉన్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి అత్యాధునిక డయోగ్నొస్టిక్ ల్యాబ్‌తో పాటు ఐకే సిటి స్కానింగ్ అత్యాధునిక యంత్ర పరికరాలు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు, ఐటిడిఏ పిఓ రాహుల్ ఏరియా ఆస్పత్రిని సందర్శించి పరికరాల ఏర్పాటుకు అనువైన భవనాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలోని అవుట్ ఇన్ పేషంట్లతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మారుమూల ప్రాంతాల నుండి వివిధ వ్యాధులతో ఆస్పత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండే విధంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేయనున్న సిటి స్కాన్ రేడియాలజీ హబ్‌కు సంబంధించి అనువైన స్థలాన్ని పరిశీలించాలని వైద్యాధికారులకు సూచించారు. అదే విధంగా టి హబ్‌కు సంబంధించి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. పనులు గడువులోగా పూర్తి చేయాలన్నారు. వైద్యులు సిబ్బంది సమయ పాలన పాటించి రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అంతా సమన్వయంతో పనిచేసి నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డా.సైదులు ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.రాజ శేఖర్ రెడ్డి, ఇఇ మధుకర్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..?

-గాంధీనగర్‌లో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని సారపాక గాంధీ నగర్‌లో విద్యుత్ తీగలు తెగిపోయే స్థితిలో వేలాడుతూ ప్రమాదం పొంచి ఉంది. ప్రతి ఆదివారం చిన్నారులతో సహా సుమారు 100 కుటుంబాలు చర్చికి వచ్చే మార్గంలోనే ఈ ప్రమాదకర తీగలు ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, గతంలోనూ అధికారుల నిర్లక్ష్యంతో తృటిలో ప్రమాదం తప్పిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తీగలకు మరమ్మతులు చేపట్టి ప్రాణనష్టం జరగకుండా చూడాలని కోరుతున్నారు.

మోడల్ మార్కెట్‌కు రూ.1 కోటి మంజూరు

- స్థలాన్ని పరిశీలించిన ఎంఎల్‌ఏ



ప్రజాపక్షం/భద్రాచలం : పట్టణంలో మోడల్ మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసి రూ.1 కోటి రూపాయల నిధులను మంజూరు చేసింది. దీంతో శుక్రవారం ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావుతో కలిసి అధికారులు మార్కెట్ యార్డులో స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించుకునే పంటలతో పాటు అంతర్పంటలుగా సాగు చేసుకునే అన్ని రకాల కూరగాయలు తప్ప ధాన్యాలు ఇతరత్రా చిరుధాన్యాలను నేరుగా మోడల్ మార్కెట్‌కు చేర్చి విక్రయించుకోవచ్చన్నారు. రైతులు కొనుగోలు దారులకు అనుకూలంగా ఉండేలా అన్ని రకాల వసతి సౌకర్యాలతో మోడల్ మార్కెట్‌ను విడుదలైన నిధులతో త్వరలో నిర్మిస్తామని చెప్పారు. మోడల్ మార్కెట్ ఏర్పాటుతో దళారాల బాధ తప్ప నేరుగా అమ్ముకునే అవకాశం ఉంటుందని, తద్వారా రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనెం కృష్ణ ఇఇ మధుకర్ డిఇ విజయ్, టిఏ శ్రీనివాస్, జిపి ఇఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల అనుచరుల పేరుతో అక్రమ దందా

- ప్రభుత్వ ధాన్యం అక్రమాలపై విచారణ జరిపించాలి
- టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చైతన్య



ప్రజాపక్షం/భద్రాచలం : రాష్ట్రంలోని మంత్రుల అనుచరులం అని చెప్పుకుంటూ కొందరు వ్యక్తులు రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని కోట్లాది రూపాయల అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు మరింత అందోళన కలిగిస్తున్నాయని ఈ వ్యవహారం వెనుక అసలు సూత్రపాత్ర దారులు ఎవరు అనేదానిపై నిగ్గు తేల్చాలని తెలంగాణ రక్షణ సమితి రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి కంగాల చైతన్య అన్నారు. ప్రధానంగా ప్రభుత్వధాన్యానికి సంబంధించిన అక్రమ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆళ్ల మురళీ అనే వ్యక్తి ఓ మంత్రికి అనుచరున్ని అని చెప్పుకుంటూ ప్రభుత్వ ధాన్యానికి సంబంధించిన కోట్లాది రూపాయల అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెలుగులోకి రావడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు జిల్లా కాంగ్రెస్ పార్టీలో కొందరు నేతలు ఇటువంటి వ్యవహారాలకు తెరవెనుక అండగా ఉంటున్నారనే విమర్శలున్నాయని, ఆరోపణలు బయటపడగానే తమకేమీ సంబంధం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ ధాన్యంపు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి నిజానిజాలను నిగ్గు తేల్చాలని సూచించారు. అమాయక గిరిజనులను లక్ష్యంగా చేసుకుని ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని చైతన్య డిమాండ్ చేశారు.

మొరంపల్లి బంజర్ నుంచి లండన్ వరకు..

-అంతర్జాతీయ వేదికపై శనగ రవీంద్రబాబు సత్తా
-ఒకేసారి తొమ్మిది అవార్డులు కైవసం



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని మోరంపల్లిబంజర్‌కు చెందిన శనగ రవీంద్రబాబు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఆయన రూపొందించిన #ఏడిఎస్ చిత్రానికి లండన్ అంతర్జాతీయ సినీ అవార్డుల్లో 9 విభాగాల్లో పురస్కారాలు లభించాయి. ప్రస్తుతం కేటీపీఎస్‌లో ఉద్యోగిగా పని చేస్తున్న రవీంద్రబాబు, బెస్ట్ స్టోరీ, షార్ట్ ఫిల్మ్, స్క్రీన్‌ప్లే, ఎడిటర్, డైరెక్టర్, సినిమాటోగ్రాఫర్, తెలుగు ఫిల్మ్, థ్రిల్లర్, ఫిల్మ్ మేకర్ విభాగాల్లో అవార్డులు సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖాత్యిని అంతర్జాతీయ స్థాయికి చేర్చారు. ఆయన విజయంపై గ్రామస్తులు, మిత్రులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగుడికి అండగా నిలిచిన సాజన్ ట్రస్ట్



ప్రజాపక్షం/ఇల్లందు: పక్షవాతంతో నడవలేని స్థితిలో ఉన్న పినబోయిన సాగర్‌కు సాజన్ దివ్యాంగులు, వృద్ధుల మానవ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ అండగా నిలిచారు. తాత్కాలిక దివ్యాంగ ధ్రువ పత్రం వల్ల ప్రభుత్వ పథకాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సాగర్‌ను శుక్రవారం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి, శాశ్వత ధ్రువపత్రం పొందేందుకు సహకరించారు. ఈసందర్భంగా యూడీఐడీ అధికారి నాగేశ్వరరావు, వైద్యులు మానవతా దృక్పథంతో స్పందించి సహకరించారని ముజాహిద్ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అండగా నిలిచిన ట్రస్ట్ అధ్యక్షుడు ముజాహిద్, అధికారులకు సాగర్ ధన్యవాదాలు తెలిపారు.

గడువులోగా పెండింగ్ సిఎంఆర్ బియ్యం అప్పగించాలి



-బియ్యం అందించని మిల్లర్లను డిఫాల్టర్లుగా పరిగణిస్తాం
-మిల్లర్లు, అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రబీ 2024 25, ఖరీఫ్ 2025 26 సీజన్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) బియ్యాన్ని నిర్దేశిత గడువులోగా సివిల్ సప్లయ్స్‌కు అప్పగించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి రైస్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సివిల్ సప్లయ్స్ జిఎం రాజేందర్, డిజిఎం ఇర్ఫాన్‌తో కలిసి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మిల్లర్లు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గడువులోగా బియ్యం అందించని మిల్లర్లను నిబంధనల ప్రకారం డిఫాల్టర్లుగా పరిగణిస్తామని హెచ్చరించారు. మిల్లర్లకు రావాల్సిన మిల్లింగ్, రవాణా ఛార్జీల బకాయి బిల్లులను యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేసి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సివిల్ సప్లయ్స్ జిఎం రాజేందర్ మాట్లాడుతూ జిల్లాలో సివిల్ సప్లయ్స్‌కు రావాల్సిన రూ.1.06 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 2027 జనవరి 31 నాటికి పూర్తి చేయాలన్నారు. ఇందు కోసం నెలకు కనీసం 35వేల మెట్రిక్ టన్నుల చొప్పున డెలివరీ చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. ప్రతివారం సిఎంఆర్ డెలివరీ పురోగతిపై సమీక్ష నిర్వహించి మిల్లర్ల వారీగా సరఫరా వివరాలను పరిశీలిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్, డిఎం సివిల్ సప్లయ్ మల్లికార్జున్ బాబు, రైస్‌మిల్లర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ గోదాములను సద్వినియోగం చేసుకోవాలి

-ఐసిఎం ప్రోగ్రాం డైరెక్టర్ శ్యాంకుమార్

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేని సమయంలో నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాములను సద్వినియోగం చేసుకోవాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసిఎం) ప్రోగ్రాం డైరెక్టర్ శ్యాంకుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఏసిఎస్) కార్యాలయంలో గిడ్డంగి అభివృద్ధి సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో రైతులు, వ్యాపారులు, మిల్లర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంకుమార్ మాట్లాడుతూ రైతులు ఎన్నో కష్ట నష్టాలను ఎదుర్కొని పంటలను పండిస్తున్నప్పటికీ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మార్కెట్‌లో ఆశించిన ధర లేనప్పుడు వాటిని నిల్వ చేసుకునే అవకాశం లేక తక్కువ ధరకు రైతులు అమ్ముకుంటున్నారన్నారు. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి గోదాములను నిర్మిస్తున్నప్పటికీ వాటి వినియోగంపై రైతులకు



అవగాహన లేదన్నారు. ఆశించిన ధర లేనప్పుడు రైతులు తమ పంట ఉత్పత్తులను ప్రభుత్వ గోదాముల్లో భద్రపర్చుకుని ఆర్థికంగా లబ్ధి పొందాలన్నారు. గోదాముల్లో నిల్వ చేసుకున్నందుకు నామ మాత్రపు రుసుము మాత్రమే రైతుల నుంచి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, ఉపాధ్యక్షులు రావెళ్ల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, సహకార శాఖాధికారి మహికుమారి, సీతమ్మో ఐతగాని తిరుపతిరావు, డైరెక్టర్లు, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

అదైర్యపడకండి అండగా ఉంటాం : సండ్ర



-కెసిఆర్ కాలనీ వరద బాధితులకు నిత్యావసర సరుకులు, - రూ.5 వేల తక్షణ ఆర్థికసాయం అందజేత
-ప్రభుత్వానికి రూ.50 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్

ప్రజాపక్షం/సత్తుపల్లిః పట్టణ శివారులోని కేసీఆర్ కాలనీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ఆకస్మిక వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన పలు కుటుంబాలకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అండగా నిలిచారు. శుక్రవారం వరద బాధిత కుటుంబాలను కలుసుకుని అండగా ఉంటామని,అదైర్య పడొద్దన్నారు. ఒక్కో కుటుంబానికి 10 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు దిండు,దుప్పట్లు, పరుపులతో పాటు ప్రతి కుటుంబానికి రూ.5 వేల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం అందించి బాధితులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ఆకస్మిక వరదలతో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. ప్రతి బాధిత కుటుంబానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కేసీఆర్ కాలనీ పక్కనే ఉన్న లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో వరదల కారణంగా సుమారు 70కి పైగా లారీల ఇంజిన్లు దెబ్బతిని తీవ్ర ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. లారీ యజమానులు కూడా భారీగా నష్ట పోయారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. లారీ యజమానులకు కూడా తగిన పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వరదలతో నష్టపోయిన పేద కుటుంబాలు, లారీ యజమానులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించి న్యాయం చేయాలని సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్, కొన్నెలర్లు వీరపనేని రాధిక,బెల్లంకొండ రాము, మహేంద్రబాషా, సురేష్ గాదే, బిఆర్ఎస్ నాయకులు వీరపనేని బాబి, వల్లభనేని పవన్, ప్రకాష్ రావు, నడ్డి ఆనందరావు తదితరులున్నారు.

డిజిటల్ పాలనతో పారదర్శకత

-డిడిఓల శిక్షణా కార్యక్రమంలో డిఆర్ఓ రామ్మూర్తి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రభుత్వ పాలనలో పారదర్శకత పెంచేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఎంతగానో దోహదపడుతుందని జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఈహెచ్ఆర్ఎంఎస్, ఈ శాంక్షన్స్, డబ్ల్యూఏఎంఐఎస్ మాడ్యూల్స్‌పై డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులకు (డిడిఓ) నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని డిఆర్ఓ రామ్మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల నియామకం నుంచి పదవి విరమణ వరకు సర్వీసు వివరాలు అన్ని ఇకపై ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించబడతాయన్నారు. ప్రభుత్వ వ్యయాలు, బిల్లుల మంజూరుతో పాటు అభివృద్ధి పనుల అంచనాలు, సాంకేతిక అనుమతులు , కాంట్రాక్ట్ ప్రక్రియలన్ని డిజిటల్ విధానంలో పారదర్శకంగా పర్యవేక్షిస్తారని తెలిపారు. దీని వల్ల పైళ్ల జాప్యం తగ్గి సత్వరమే సేవలు అందుతాయని తెలిపారు. అధికారులు తప్పనిసరిగా ఈ విధానాన్ని పాటించాలని సూచించారు. జిల్లా ఖజానా కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ వై. శ్రీనివాసరెడ్డి, జిల్లా పిఏఓ కె. రామ్‌లు డిడిఓలకు శిక్షణనిచ్చారు.ఈ శిక్షణకు 650 మంది అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైరా ఏటిఓ ప్రసన్నకుమార్, ఎట్టివోలు మోదుగు వేలాద్రి, నాగేంద్రకుమారి, మధిర వెంకటేశ్వర్లు, సునీల్, విజయసారధి, పిఏఓ, సూపరింటెండెంట్ రాధికారెడ్డి, జిల్లా ఖజానా కార్యాలయ సిబ్బంది, సబ్ ట్రెజరీల సిబ్బంది పాల్గొన్నారు.

వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : భారత ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ, మై భారత్ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం ఆవిష్కరించారు. దేశ యువతను మాదక ద్రవ్యాల (డ్రగ్స్) బారినపడకుండా కాపాడుతూ, వ్యసన రహిత భారతదేశాన్ని నిర్మించడం, యువత తమ ఆలోచనలు, అభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తపరిచేందుకు ఈ కార్యక్రమం ఓ మంచి వేదికగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. యువతలో పార్లమెంట్ వ్యవస్థ, రాజ్యాంగ విలువలు, పౌర బాధ్యతలు, దేశ నిర్మాణంలో యువత పాత్రపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. యువత ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని నిర్వహకులు తెలిపారు. నవంబర్ 10న కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాల నందు ఉదయం తొమ్మిది గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ అనే అంశంపై తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో ఉపన్యాస పోటీలు నిర్వహించబడతాయన్నారు. 18 నుండి 25 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ రామ్మూర్తి, మై భారత్ జిల్లా యువ అధికారి మద్దుల వెంకటరాంబాబు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్

ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో గురువారం రాత్రి ఓ మహిళ మెడలో నుంచి ఇంటి వెనుక అంట్లు రుద్దుకొనే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మెడలో నుంచి బంగారం గొలుసును లాక్కెళ్ళినట్లు కల్లూరు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... కీసర బుచ్చమ్మ ఇంటి వెనక గిన్నెలు కడుగుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి తన మెడలో ఉన్న రెండున్నర తులాల సుమారు 87500 నాన్‌తా ను తెంపుకొని వెళ్లడం జరిగిందని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

ఓటు హక్కుపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి



ప్రజాపక్షం/పెనుబల్లిః ప్రజాస్వామ్యంలో 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హులైన పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పెనుబల్లి మండల తహశీల్దార్ వీరభద్ర నాయక్ అన్నారు. శుక్రవారం పెనుబల్లి మండల కేంద్రంలోని రమేష్ స్కై స్కూల్ ఆవరణలో విద్యార్థులు, యువతకు ఓటు హక్కు ప్రాముఖ్యత మరియు ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన యువతీ యువకులందరూ తక్షణమే ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. నిర్ణీత సమయంలో డిగ్రీ పూర్తి చేసుకున్న పట్టభద్రులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకొని, శాసనమండలి (పెద్దల సభ) కి అర్హులైన ప్రజాప్రతినిధులను పంపేందుకు తమ బాధ్యతను నెరవేర్చాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో యువత మరియు విద్యార్థుల పాత్ర కీలకమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, నిర్వహకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

13ఏళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడి

- 32 ఏళ్ల వివాహితుడిపై ఫోక్సో కేసు నమోదు
- రిమాండ్‌కు తరలింపు



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : మండల పరిధిలోని చంద్రు తండా గ్రామపంచాయతీలో దారుణ ఘటన చోటు చేసుకుంది. అదే తండాకు చెందిన 13ఏళ్ల గిరిజన మైనర్ బాలికపై బోడ రమేష్(32) అనే వివాహితుడు మాయమాటలు చెప్పి నమ్మబలికి లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యసి స్తున్న బాలిక ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో బాలిక తల్లి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించింది. పరీక్షించిన వైద్యులు బాలిక గర్భవతి అని నిర్ధారించారు. దీంతో తల్లి బాలికను నిలదీయగా తన గర్భానికి బోడ రమేష్ కారణమని బాలిక తెలిపినట్లు సమాచారం. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై పొగుల సురేష్ కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు నిమిత్తం కూసుమంచి సిఐ సంజీవ్ విచారణ చేపట్టారు. నిందితుడు రమేష్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాసవి మాత ఆలయంలో అన్నదానం



ప్రజాపక్షం/మధిరః మధిర పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దొడ్డా తులసమ్మ జ్ఞాపకార్థం కుమారుడు దొడ్డా వెంకటనారాయణ, కోడలు పద్మావతి, మనువడు హర్ష వైభవ్, మనువరాలు బృందా వైభవిల ఆర్థిక సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ధాతలు మాట్లాడుతూ అన్నదానానికి మించిన దానం లేదని, అన్నం పరబ్రహ్మ స్వరూపమని పేర్కొన్నారు. దేవాలయంలో ప్రతి శుక్రవారం ధాతల సహకారంతో పేదలకు అన్నప్రసాద వితరణ నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ దేవాలయ కమిటీ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బియ్యం కిరాణా దుకాణాల్లో విస్తృత తనిఖీలు



- ఆరుగురిపై కేసు నమోదు
- తూకాల్లో మోసాలు చేస్తే కఠిన చర్యలు
- తు.కొ అధికారి మనోహర్

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : కొలతల్లో కూతలు తూకాల్లో మోసాలు చేసి వినియోగదారులను దోచుకుంటే ఉపేక్షించేది లేదని అలాంటి వారిపై చట్ట రిత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల అధికారి మనోహర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన కొత్త గూడెంలోని పలు బియ్యం విక్రయ కేంద్రాలు, కిరాణా షాపుల్లో విస్తృ తంగా ఏకకాలంలో తన సిబ్బందితో కలిసిత బూబాక్యాంపు పెద్దబజార్ లలో తనిఖీలు చేపట్టారు. బియ్యంబస్తాలు తూకం వేయగా 26 కేజీ లుగా పేర్కొన్న బస్తాల్లో కేవలం 25 కేజీలు మాత్రమే ఉన్నట్లు గుర్తిం చారు. దీంతో నిబంధనల ఉల్లంఘన క్రింద కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాకింగ్ చేసిన సరుకుల బస్తా లపై ఉన్న బరువు వినియోగదారులకు ఇచ్చే సమయంలో కూడా ఉండా లన్నారు. ఏమాత్రం తేడాలున్నా చట్టరిత్యా శిక్షార్హులు అవుతారని చెప్పారు. వినియోగదారులు కూడా సరుకులు కొనుగోలు చేసే సమ యంలో ముద్రించిన నికర బరువును తూకాన్ని తప్పని సరిగా పరిశీలిం చాలని సూచించారు. వ్యాపారులు నిబంధనల ప్రకారం అమ్మకాలు సాగించాలని వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తూనికలు కొలతల అధి కారి తెలిపారు.

కల్తీ మద్యం కలకలం.. ఫిర్యాదు చేసినా పట్టించుకోరా..?



-మండలంలోని పలు గ్రామాల్లో నకిలీ మద్యం విక్రయాలంటూ ఆరోపణలు
-క్షేత్రస్థాయిలో విచారణ చేపడతాం
ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి

ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలంలో కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. పలు గ్రామాల్లో నకిలీ మద్యం విక్రయాలు సాగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికా రులు పట్టించుకోవడం లేదంటూ ఓ అధికారి, సామాజిక కార్యకర్త చేసిన ఆరోపణలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మండలంలోని పలు గ్రామాల్లో హైదరాబాద్ కేంద్రంగా తయారవు తున్న నకిలీ మద్యం విక్రయిస్తున్నారని మంగాపురం తండాకు చెందిన టీజీఎన్‌పీడీసీఎల్ లైజనింగ్ ఆఫీసర్, సామాజిక కార్యకర్త ధీరావత్ కోటే శ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అనధికారికంగా తయారవుతున్న మద్యం సేవించడం వల్ల ప్రజలు అనా రోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, మరోవైపు ప్రభుత్వ ఆదాయా నికి గండి పడుతోందని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసినప్పటికీ అధికా రులు స్పందించడం లేదని ఆయన విమర్శించారు. యువత నాటు సారా, కల్తీ మద్యానికి దూరంగా ఉండాలని, మద్యానికి అలవాటుపడి చిన్న వయసులోనే ఆరోగ్యాన్ని, జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మండలంలో కల్తీ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికా రులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

విచారణ చేపడతాం.. కఠిన చర్యలు తీసుకుంటాం

ఈ ఆరోపణలపై ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డిని వివరణ కోరగా, కల్తీ మద్యం విక్రయాల విషయం తమ దృష్టికి రాలేదని తెలి పారు. అయినప్పటికీ వెంటనే క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపడతా మని, కల్తీ మద్యం విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టాల్సిందే..



గ్రామ శివార్లలో సామూహిక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి
-ప్రతిభ చూపిన పంచాయతీలకు జనవరి 26న సన్మానం
-జిల్లా పంచాయతీ అధికారి వినోద్‌కుమార్

ప్రజాపక్షం/నేలకొండపల్లి : రాబోయే ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావా లని, ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి భద్రపరచాలని జిల్లా పంచాయతీ అధికారి వినోద్‌కుమార్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీ ఓలు, ఎంపీఓలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించి గ్రామాల వారీగా నీటి సంరక్షణ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, జలసిరి పథకం కింద నీటి నిల్వల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నీటిని వృథా చేయకుండా ప్రతి చుక్కను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల శివారు ప్రాంతాల్లో సామూహిక ఇంకుడు గుంతలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, స్వచ్ఛ భారత్ మిషన్ నిధులతో గ్రామ సమాఖ్య భవనాల్లో మరుగుదొడ్లు నిర్మించి నవంబర్ 15లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వార్డుల వారీగా నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టి ప్రజలను భాగస్వాము లను చేయాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచే యాలని సూచించారు. చేపట్టిన పనులను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రతి పంచాయతీలో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జలసిరి పథకం కింద పను లను సమర్థవంతంగా పూర్తి చేసి ఆదర్శంగా నిలిచిన పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులను జనవరి 26న సన్మానిస్తామని ప్రకటిం చారు. ఈ జూమ్ సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు, కార్యద ర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొనగా, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి ఎం.శ్రీనివాస రావు, ఈజీఎస్ ఈసీ శేషగిరిరావు, టీఏలు యాకయ్య, గోపి, శైలజ, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో మురుగునీటి సమస్య

-ప్రజలకు దుర్వాసన కష్టాలు
-రోడ్లపై మురుగునీరు, దోమల బెడద



ప్రజాపక్షం/ఇల్లందు: పట్టణంలోని 15వ వార్డులో బాబ్లీ రెస్టారెంట్, మాన్విత ఫ్లెక్సీ పక్క రోడ్డుపై ఇళ్ల మురుగునీరు చేరి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివే ళల్లో కొందరు మురుగునీటిలో పడి అనారోగ్యానికి గురయ్యారని స్థానికులు తెలిపారు. నిల్వ నీటితో దోమలు వ్యాప్తి చెంది ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు వెంటనే ప్రాం తాన్నిపరిశీలించిమురుగునీటిసమస్యనుపరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

11991 ఎకరాల్లో దెబ్బతిన్న పంటల

- 145 గ్రామాల్లో 4963 మంది రైతులకు నష్టం
- లెక్కలు తేల్చిన జిల్లా వ్యవసాయాధికారులు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో మురసు తుఫాను రైతులను నట్టేట ముంచింది. ఆరుగాలం కష్టపడి చేతికందిన పంట తుఫాను ప్రభావంతో పూర్తిగా ధ్వంసమైంది. దీంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మురసు తుఫాను కారణంగా 145 గ్రామల్లో 4963 మంది రైతులకు చెందిన 11991.4 ఎకరాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వర్షపునీటిలో పూర్తిగా తడిసి ముద్దవడమే కాకుండా నీటి మునిగిపోయాయి. వీటిలో ప్రధానంగా వరి, మినుములు, పత్తి అపరాలు, పామాయిల్ పంటలు పూర్తిగా నాశనం అయ్యాయి. రెండు రోజులుగా గ్రామాల వారీగా సర్వే నిర్వహించిన వ్యవసాయాధికారులు శుక్రవారం సాయంత్రానికి లెక్కలను అందించారు. వ్యవసాయాధికారి బాబూరావు పూర్తి వివరాలు తెలిపారు. మురసు తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పలు రకాల పంటల వివరాలను సేకరించామని, ఆ నివేదికను ఉన్నతాధికారులు అందజేస్తామని, త్వరలో రైతులకు పంటనష్ట పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు.

కనిపించకుండా పోయిన ఏర్ కానిస్టేబుల్ భార్య

- కానిస్టేబుల్‌ను విచారిస్తున్న పోలీసులు

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : జిల్లాలో పనిచేస్తున్న ఓ ఏఆర్ కానిస్టేబుల్ భార్య కనిపంచక పోవడం మిష్టరీగా మారింది. కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని 3 టౌన్ ఏరియా ప్రగతి నగర్‌లో నివాసం ఉంటున్న ఆమె ఈనెల 3వ తేది రాత్రి నుండి కనిపించకుండా పోవడంతో పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆదే రాత్రి భర్త ఓ బస్తాలో మూటకట్టి బండిపై భద్రాచలం వైపు తీసుకెళ్లినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. దీంతో భద్రాచలం గోదావరి నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఏఆర్ కానిస్టేబుల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోగా డిఎస్పి ఆదినారాణ విచారిస్తున్నట్లు తెలిసింది.

ఎరువుల దుకాణాల్లో ఏడీఏ తనిఖీలు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో వైరా వ్యవసాయ శాఖ ఏడీఏ కరుణశ్రీ శుక్ర వారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలం కేంద్రం తో పాటు పలు గ్రామ లోని దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, పీఓఎస్ యంత్రాల్లోని నిల్వలు, విక్రయాల రికార్డు లను పరిశీలించారు. ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా, అనుమతిలేని రసాయనాలు అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు నిబంధనల ప్రకారం ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచిం చారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ మండల అధికారి యం.రాధా సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తోలకాలు



ప్రజాపక్షం/పాల్వంచ : అనుమతుల పేరుతో అక్రమంగా రాత్రి, పగలు అక్రమంగా మట్టి తోలకాలు సాగుతున్నాయి. సమాచారం సంభందిత శాఖల అధికారులకు సమాచారం అందజేసినా పట్టించుకోవటం లేదనే ఆరోప ణలు తలెత్తుతున్నాయి. మండల పరిధి నాగారం గ్రామ సమీపంలోని మూతపడిన ఓ క్రషర్ మిల్లు సమీపంలో జేసిబి సహాయంతో మట్టిని తోడేస్తూ పదులు సంఖ్యలో టిప్పర్ల ద్వారా వందలాది ట్రిప్పుల మట్టిని రంగాపురం తర లిస్తున్నారు. అధికారుల నుండి అనుమతులు లేకుండానే ధర్జాగా రాత్రి, పగలు లేదా లేకుండా యదేశ్చగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అనుమతుల పేరుతో సాగు తున్న అక్రమ పర్వంపై అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని కోరు తున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ దారా ప్రసాద్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా విషయం మా దృష్టి వచ్చిందన్నారు. రూరల్ ఆర్ఐని పంపించామని తెలిపారు.

హామీలతో సరిపెట్టకుండా పరిహారం చెల్లించాలి

రైతుల ఖాతాల్లో తక్షణమే నిధులు జమ చేయాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : హామీలతో సరిపెట్టకుండా తక్షణమే నిధులు విడుదల చేసి రైతుల ఖాతాల్లో నష్టపరిహారం జమ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంక టేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండలంలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుఫాన్ ప్రభావంతో వరి, మొక్కజొన్న, మిర్చి, పత్తి తదితర పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి కష్టపడి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో దెబ్బతినడంతో రైతులు ఆర్థికంగా కుదేలయ్యారని అన్నారు. వరి, మొక్కజొన్న పంటలకు ఎకరాకు రూ.40 వేలు, మిర్చి, పత్తికి రూ.50 వేలు, ఉద్యాన పంటలకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, తక్షణమే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎస్.కె.సత్తార్, కనకబండి రామయ్య, రావెళ్ల కృష్ణ, బాలిన కృష్ణం, రాజు, భూక్యా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో అధ్వానంగా రోడ్లు..!

-వర్షం పడితే బురదమయం
నడవడానికి కూడా వీల్లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
-పట్టించుకోని అధికారులపై స్థానికుల ఆగ్రహం



ప్రజాపక్షం/వైరాः వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు దిద్దిపూడిలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. కురుస్తున్న వర్షాలతో వార్డులోని రోడ్లన్నీ బురదమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం నడవడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. బురద రోడ్లపై ప్రయాణించేటప్పుడు జారిపడి కిందపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వార్డులో రోడ్ల దుస్థితిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి స్పందన లేదని 15వ వార్డు కౌన్సిలన్ నల్లమోతు శైలజ పేర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరినప్పటికీ అధికారులు పట్టించుకోవడంపై వార్డు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే రోడ్లపై బురద పేరుకుపోవడంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు వెళ్లడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు 15వ వార్డు దిద్దిపూడిలో పర్యటించి రోడ్ల పరిస్థితిని పరిశీలించాలని, బురదమయంగా మారిన రోడ్లకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. శాశ్వత పరిష్కారం సాధ్యమయ్యే వరకు కనీసం తాత్కాలిక ప్రత్యామ్నాయ ఏర్పాటైనా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా రోడ్ల సమస్యపై నిర్లక్ష్యం ఎందుకని వార్డు ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ముదిరాజ్ కులాన్ని బిసి-ఏలో చేర్చొద్దు

ఖమ్మం జిల్లా నాయిబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ దివాకర టిఎస్‌కు వినతిపత్రం



**ప్రజాపక్షం/మధిరఃఃః